
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025



కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా ఎల్లాజీరావు



విజయనగరం క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విజయనగరం కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా జి.ఎల్లాజీరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ సహాయ కమిషనర్‌గా ఉన్న ఏటీ శ్రీనివాసులు శ్రీకాకుళం జిల్లా కార్మికశాఖకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎల్లాజీరావు మాట్లాడుతూ, జిల్లాలో కార్మికులకు ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



ఘన విజయానికి ఏడాది

- ఏకపక్ష విజయంతో నాడు శ్రేణుల సంబరాలు
- ఊహకందని ఫలితాలు.. ఐదేళ్ల అధిపత్యానికి చెక్
- అదే ఐక్యతగా అడుగులేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ



విజయనగరం/ రాజాం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి)

"నరాలు తెగే ఉత్కంఠతో అందరూ టీవీలకు అతుక్కుపోయారు. ఎన్నికల ఫలితాల కోసం ఆర్తిగా ఎదురుచూశారు. తొలుత ఉద్యోగుల ఓట్ల లెక్కింపుతో ప్రారంభమైన కౌంటింగ్ గంటకు గంటకు టెన్షన్ పెట్టింది. కొన్ని రౌండ్‌ల తర్వాత ఒక్కో అడుగు విజయం వైపు పడింది. చివరకు విజయం ఏకపక్షమైంది. దీంతో కూటమి పార్టీల శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. డిజాస్టర్ ఫలితాలతో వైసీపీ శ్రేణులు తీవ్ర నిరాశలో మునిగిపోయాయి" ఏడాది కిందట అంటే 2024 జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడు ఆవిష్కృతమైన ఘటనలివి. జిల్లాలో కూటమి ఘన విజయం సాధించింది. అన్ని అసెంబ్లీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేసింది.

అంచనాలను పటాపంచలు చేస్తూ..

గత ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు వెల్లడైన సర్వేలు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పాయి కానీ విజయనగరం జిల్లా కు వచ్చేసరికి వైసీపీకి ఆధిక్యత రావొచ్చున న్నాయి. పథకాలు ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, మహిళలు మొగ్గుచూపారని చెప్పుకొచ్చాయి. ఫలితాలు వచ్చేసరికి వార్ వన్‌సైడ్ అయిపోయింది. అన్నిచోట్లా (మిగతా 8వ పేజీలో..)



చీపురుపల్లిలో సంబరాలు(ఫైల్)



రాజాం ప్రధాన రహదారిపై బొబ్బిలి వెళ్లే కూడలి వద్ద పేరుకుపోయిన చెత్త ఇది. చెత్త సేకరణ సరిగా జరగక రోడ్డుపై నిత్యం ఇదే పరిస్థితి. అటువైపుగా వెళుతున్న వారు దుర్గంధంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

- మునిసిపాలిటీల్లో చాలీచాలని పారిశుధ్య కార్మికులు
- ఉన్నవారిపై పనిభారం
- వర్షాకాలంలో కష్టమే
- శివారు ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్త

చెత్తశుద్ధి లేకపోయె

రాజాం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పురపాలక సంఘాలన్నింటా రోడ్లు, వీధులు, జంక్షన్లు, ముఖ్యమైన ప్రాంతాలు అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. పారిశుధ్యం లేక దుర్గంధంగా మారుతున్నాయి. పట్టణాల జనాభాకు తగినట్లు పారిశుధ్య కార్మికులు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. శాశ్వత కార్మికుల కంటే కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారే అధికంగా ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త నియామకాలు లేవు. ఉమ్మడి జిల్లాలో విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి, రాజాం, సాలూరు, పార్వతీపురం మునిసిపాల్టీలు, నెల్లిమర్ల, పాలకొండ నగర పంచాయతీలు ఉన్నాయి. మరో 10 వరకూ మేజర్ పంచాయతీలున్నాయి. ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులు లేరు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పన్నులు వసూలు చేస్తున్న పాలకవర్గాలు సౌకర్యాల విషయంలో వెనుకడుగు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విజయనగరం కార్పొరేషన్‌లో 125 నుంచి 130 మెట్రిక్ టన్నుల మేర చెత్త ఉత్పత్తవుతోంది. 445 మంది ఔట్ సోర్సింగ్, 199 మంది రెగ్యులర్ కార్మికులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కానీ పెరిగిన నగరానికి వీరు ఏమూలకు సరిపోవడం లేదు. మరో 100 మంది కార్మికులను నియమిస్తే కానీ పూర్తిస్థాయిలో (మిగతా 8వ పేజీలో..)



ఈ-దోపిడీకి అడ్డేలేదా?

జిల్లాలో అధికారులు, వెండర్లు వద్ద ఉండాల్సిన ఎలక్ట్రానిక్(ఈ)స్టాంపులు అంగడి సరుకుగా మారి అక్రమార్కులకు కాసులవర్షం కురిపిస్తున్నాయి. అమ్మకందారుల సంతకాలతో ఖాళీ స్టాంపు పేపర్లు చేతులు మారుతూ వెండర్లు, దళారీల పంట పండిస్తున్నాయి. ఈ అడ్డదారి వ్యాపారం ద్వారా ఒక్కొక్కరు రోజుకు రూ.5వేలకు తక్కువ కాకుండా సంపాదిస్తున్నారు. అంతిమంగా ఈభారం సామాన్య ప్రజలపై పడుతోంది.

- రూపం మార్చుకున్న అక్రమ బాగోతం
- దళారులు, వెండర్లు ఒక్కటై వ్యవహారం
- ఒకే వ్యక్తి పేరుతో వందల స్టాంపులు
- ఖాళీ పేపర్లపై ముందే నోటరీ
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- సామాన్యులపై బాదుడు

మెంటాడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అధికారిక వెండర్ల వద్ద ఉండాల్సిన ఎలక్ట్రానిక్(ఈ)స్టాంపులు దుర్వినియోగమవుతున్నాయి. వెండర్లు, దళారులు కుమ్మక్కై నడిపిస్తున్న ఈ వ్యవహారంలో ఆయా వర్గాలపై రోజూ లక్షలాది రూపాయల భారం పడుతోంది. సామాన్యుల జేబులు గుల్లవుతున్నాయి. యంత్రాంగం పట్టించుకో కపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుల అవసరాన్ని, అమాయ కత్వాన్ని ఆసరాగా తీసుకుని ఆయావర్గాలు నిలువుదోపిడీ చేస్తున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లావ్యాప్తంగా నెలకు రూ.40 లక్షల వరకు చేతులు మారుతున్నాయి. అంతిమంగా ఈభారమంతా అవసరార్థులపైపడి వారి జేబులు ఖాళీ అవుతున్నాయి.

అన్నిరకాల లావాదేవీలు నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో సజావుగా సాగుతున్న వేళ గత వైసీపీ ప్రభుత్వం ఏవేవో కారణాలు (మిగతా 8వ పేజీలో..)

వెన్నుపోటు పొడిచింది వైసీపీయే
- జగన్ ఐదేళ్ల పాలన అరాచకం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

6లో

అవసరమైనప్పుడు రుణం
- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- గ్రామస్థాయిలో వెలుగు సిబ్బంది సర్వే

6లో

పైడిమాంబకు ప్రత్యేక పూజలు
- అమ్మవారికి నృత్య నీరాజనం

పదోన్నతి లభించిన కొద్దిరోజులకే..
- రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ ఎస్ఐ దుర్మరణం

7

'ఉపాధి' బకాయిలు రూ.1.87 కోట్లు
- ఏప్రిల్ రెండో వారం నుంచి అందని వేతనాలు
- కొనసాగుతున్న పనులు

7

ఆ మూడు ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వండి

- తప్పు చేసేవారిపై క్రిమినల్ చర్యలు తప్పవు
- గర్భిణులు, శిశువుల మృతిపై నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్


విజయనగరం/కలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాతాశిశువుల పట్ల నిర్లక్ష్యం వహించిన మూడు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 74 శాతం తల్లులకు సిజేరియన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా ఎంపీసీడీఎస్ఆర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా మాత, శిశుమరణాలు చోటుచేసుకోవడం సరికాదని, ఎందుకు అలాంటి పరిస్థితి వస్తోందని ప్రశ్నించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులకు ట్రీట్‌మెంట్ పేరుతో వేలాది రూపాయలు లాగేస్తున్నారని, పరిస్థితి చేయి దాటాక నెలలు నిండిన తల్లిని ఘోషా లేదా పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో తల్లి లేదా శిశువు మృతిచెందితే పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, తప్పు జరిగితే క్రిమినల్ కేసు నమోదు చెయ్యాలని ఆదేశించారు. జిల్లాలో ప్రసవ సమయం (మిగతా 8వ పేజీలో..)

రేషన్ పంపిణీలో సర్వర్ సమస్య

- జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది వృద్ధులు, దివ్యాంగులకు సరఫరా



గంట్యాడ: వృద్ధుని ఇంటికి వెళ్లి సరుకులు పంపిణీ చేస్తున్న డీలరు



ఈపోస్ మిషన్‌లో సర్వర్ పనిచేయని దృశ్యం

విజయనగరం కలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. సర్వర్ సమస్యలు వెంటాడుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి డీలర్లు సరుకులు అందిస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 25 వేల కార్డులకే సరఫరా చేయగలిగారు. 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సరుకులు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు డిపోల వద్ద కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు జిల్లా వ్యాప్తంగా 65,913 మంది ఉండగా వీరిలో 24,582 మందికి సరుకులు పంపిణీ చేశారు. డిపోలన్నీ ఒకేసారి ప్రారంభిస్తుండడంతో సర్వర్ పనిచేయడం లేదు. కార్డుదారులు ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వస్తోంది.

గ్రోత్‌సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించండి
- ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

8

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి
- బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు

8

నామమాత్రంగా థియేటర్ల తనిఖీ

7

ముషిడిపల్లిలో ఎట్టకేలకు ఆక్రమణల కూల్చివేత

7

అంబరాన సిరి సంబరం

- వైభవంగా ఇప్పల పోలమ్మ, యర్ర కంచమ్మ సిరిమానోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో బెలగాం బంగారమ్మ తల్లి ఘటాల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం.. కిటకిటలాడిన ఆలయాలు
- పార్వతీపురం సందడే సందడి



సిరిమాను సంబరాలతో పార్వతీపురం సందడిగా మారింది. భక్తజనం పులకించింది. అంతటా అమ్మవార్ల నామస్మరణ మార్మోగింది. మంగళవారం పార్వతీపురంలో ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ సిరిమానోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. భక్తులు అడుగడుగునా సిరిమానులను తాకి పులకించిపోయారు. వేలాది మంది ఉత్సవాలను తిలకించి పరవశించిపోయారు. మూడేళ్లకొకసారి జరిగే పండుగలు కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో పార్వతీపురం కిటకిటలాడింది. బంధువులు, స్నేహితులతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. మరోవైపు ఉదయం నుంచి అమ్మవార్ల ఆలయాలు భక్తుల తాకిడి పెరిగింది. ప్రజలు విశేష పూజలు, అర్చనలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, పూలంగిసేవ నిర్వహించారు. బెలగాం బంగారమ్మ తల్లి ఘటాలను భక్తజనం నడుమ ఊరేగింపు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

(పూర్తి వివరాలు 6వ పేజీలో)

అంబరాన సిరి సంబరం

- వైభవంగా ఇప్పల పోలమ్మ, యర్ర కంచమ్మ సిరిమానోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో బెలగాం బంగారమ్మ తల్లి ఘటాల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం.. కిటకిటలాడిన ఆలయాలు
- పార్వతీపురంలో సందడే సందడి



పూజలందుకుంటున్న యర్ర కంచమ్మ

పార్వతీపురం/టౌన్ జూన్3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో సిరిమాను సంబరాలు అంబరాన్నంటాయి. మూడేళ్లకొకసారి జరిగే అక్కాచెల్లెళ్ల ఇప్పల పోలమ్మ, యర్రకంచమ్మ సిరిమానోత్సవాలు తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. మంగళవారం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలతో పాటు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మొత్తంగా పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మరోవైపు బంధువులు, స్నేహితులతో పట్టణంలో ప్రతి వీధి కళకళలాడింది. సుమారు 3 లక్షల మంది వరకు ప్రజలు తరలిరావడంతో జిల్లా కేంద్రం కిటకిటలాడింది. అంతటా సందడి వాతావరణం నెలకొంది.

ఆలయాలకు భక్తుల తాకిడి..

పార్వతీపురం పట్టణం, జగన్నాథపురం, బెలగాం ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మల, బంగారమ్మ ఆలయాలు మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచే భక్తులతో కిటకిటలాడాయి. సొంత జిల్లా నుంచే కాకుండా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, ఒడిశా నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. క్యూలైన్లలో గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం అమ్మవార్లను దర్శించుకుని పులకించిపోయారు. మరో వైపు ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, పూలంగిసేవ నిర్వహించారు. బెలగాం బంగారమ్మ తల్లి ఘటాలను భక్తజనం నడుమ ఊరేగింపు నిర్వహించారు.

సిరిమానోత్సవాలు ఇలా..

● పట్టణంలోని నాయుడు వీధిలోని ఇప్పలపోలమ్మకు మంగళవారం సాయంత్ర ఏడు గంటలకు విశేష పూజలు చేశారు. పూజారి ఆరిక రాజారావు సిరిమానును అధిరోహించిన తర్వాత రెడ్డివీధిలోని బుడుమూరు శ్రీను ఇంటి నుంచి సిరిమానోత్సవం ప్రారంభమైంది. టౌన్ పోలీసు స్టేషన్ వీధి నుంచి నాలుగు రోడ్ల కూడలి (ఎడమవైపు), పాతబస్టాండ్, కుసుమగుడ్డి వీధి, తెలకవీధి మీదుగా మళ్లీ టౌన్ పోలీసుస్టేషన్ వీధి, నాలుగురోడ్ల కూడలి (కుడివైపు) గాంధీ సత్రం వరకు సిరిమానోత్సవం సాగింది. అక్కడ నుంచి ఘటాలను వనం గుడికి తీసుకెళ్లిన తర్వాత అనుపోత్సవం నిర్వహించారు.

● జగన్నాథపురం యర్రకంచమ్మ ఆలయంలో సాయంత్రం 6.30 గంటలకు పూజారి నక్కా వాసుదేవరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత రెడ్డి సీతారాం ఇంటి వద్ద సిరిమాను అధిరోహించారు. కొత్తవీధి, రాయగడ రోడ్డు, పాతబస్టాండ్, పోలీసుస్టేషన్ వీధి, తెలకలవీధి మీదుగా ప్రధాన ఆలయం వరకు సిరిమానోత్సవం సాగింది.



ఇప్పల పోలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆలయం బయట క్యూలైన్లలో భక్తజనం ఇలా..





ఆకట్టుకున్న వేషధారులు



సంబరాల్లో నృత్య ప్రదర్శన



ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బొమ్మలు

నేటికీ అవే పేర్లు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా గత ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలకు అవే పేర్లు కొనసాగుతున్నాయి. రైతు సేవ కేంద్రాలుగా మార్పు చేయాలని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవెంటనే ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా 510 కేంద్రాలు ఉండగా ఇంత వరకూ 94 భవనాలకే పేరు మార్చారని సమాచారం. ఒక్కో కేంద్రానికి పేరు మార్పునకు రూ.3 వేలు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిధులు కూడా విడుదలైనట్లు చెబుతున్నారు. పేర్లు మాత్రం మారలేదు. ఇదే విషయం వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు వద్ద ప్రస్తావించగా వెంటనే రైతు సేవ కేంద్రాలుగా మార్పు చేస్తామని వెల్లడించారు.

-విజయనగరం కలెక్టరేట్, జూన్3 (ఆంధ్రజ్యోతి)



గంట్యాడ మండలం వసంత గ్రామంలోని రైతు భరోసా కేంద్రం

పచ్చని తోరణం.. ప్రకృతి సోయగం

సాలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్ర జ్యోతి): సాలూరు ఏజెన్సీలోని బొడ్డ వలస వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు పచ్చని తోరణం, ప్రకృతి శోయగంలా దర్శనమిస్తున్నాయి. గూడు మాదిరిగా ఉండడంతో ఎండ తీవ్రతకు ఇక్కడ వాహనచోదకులు, ప్రయాణికులు సేదదీరుతున్నారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న పసుపు, ఎరుపు పువ్వుల చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



పైడిమాంబకు ప్రత్యేక పూజలు

- అమ్మవారికి నృత్య నీరాజనం



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

విజయనగరం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంతం మూడు లాంతర్ల వద్ద పైడిమాంబ చదురుగుడి వద్ద వేదికపై నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని భగవతి నృత్య కళామందిర్ కళాకారులు ఆధ్యాత్మిక గీతాలకు నృత్యం చేశారు.



పైడిమాంబ దర్శనానికి క్యూలైన్లో భక్తులు



పైడిమాంబకు నృత్య నీరాజనం

ఘనంగా సీతారామాలయ ప్రతిష్ఠోత్సవం

బొండ పల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో బోడసింగిపేటలో సీతారామాంజనేయ ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గణపతి పూజ, అఖండ దీపా రాధన చేశారు. సాయంత్రం స్థానిక వేంకటేశ్వర ఆలయం నుంచి కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పూర్ణకలశాలు, విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపు గా ఆలయానికి తరలించారు. సర్పంచ్ మీసాల జానకిరావుతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విగ్రహాలను కలశాలతో ఊరేగిస్తున్న దృశ్యం

అవసరమైనప్పుడు రుణం

- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- గ్రామస్థాయిలో వెలుగు సిబ్బంది సర్వే



సాలూరు మండలం నెలిపర్తిలో నిర్వహిస్తున్న ఎంసీపీ సర్వే

సాలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం వెలుగు పథకం ద్వారా కార్యాచరణ సిద్ధం చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల్లో సభ్యులకు ఏ రుణం కావాలో, ఎంత కావాలో, ఎప్పుడు కావాలో వారి నుంచే వివరాలు సేకరిస్తోంది. సూక్ష్మ రుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్ ప్లాన్ ఎంసీపీ)పై గ్రామస్థాయిలో సిబ్బంది సర్వే చేస్తున్నారు. మహిళలకు ఏ నెలలో, ఏ అవసరానికి ఎంత రుణం కావాలో వివరాలు సేకరిస్తున్నారు. అయితే సాంకేతిక, ఇతర కారణాలు వల్ల జిల్లాలో సర్వే నెమ్మదిగా కొనసాగుతున్నది. ఈ సర్వే గత నెల 31 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఎంసీపీలో సభ్యుల రుణ అవసరాలు గుర్తించిన తదుపరి వారి బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య వల్ల బయోమెట్రిక్ సత్వరం నమోదు కావడం లేదు. తరచు వర్షాలు కురుస్తుండడంతో పాటు ఎస్‌హెచ్‌జీ సభ్యులు పొలం పనులకు వెళ్తుండడంతో సర్వే నెమ్మదిగా సాగుతున్నది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 565 గ్రామైక్య సంఘాలు, 19,829 స్వయం సహాయక సంఘాలు, 2.22 లక్షల మంది సభ్యులున్నారు. వాటిలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 15,658 సంఘాలకు రుణ ప్రణాళిక రూపొందించడానికి కసరత్తు చేస్తున్నారు. ఇకపై రుణం పొందాలంటే ప్రస్తుతం సభ్యురాలు మూడు రకాల ఫేషియల్ ఇమేజ్‌లను అప్‌లోడ్ చేయాల్సింది. ఇందుకు వీవోఏలు సభ్యుల నుంచి ఫేషియల్ ఇమేజ్‌లు సేకరిస్తున్నారు. ఇప్పటికి లక్ష మందిలోపే ఫేషియల్ ఇమేజ్‌ల సేకరణ జరిగింది.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం..

ఎంసీపీ సర్వే సాంకేతిక, ఇతర కారణాలు వల్ల నెమ్మదిగా సాగుతున్నది. వారం రోజుల్లో శతశాతం పూర్తి చేయడానికి కార్యాచరణ చేశాం. గ్రామాల్లో వేగవంతంగా జరిగేటట్టు చర్యలు తీసుకుంటాం.

-ఎం.సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ. పార్వతీపురం పురం మన్యం జిల్లా

వెన్నుపోటు పొడిచింది వైసీపీయే

- జగన్ ఐదేళ్ల పాలన అరాచకం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నట్టేట ముంచి, ప్రజలకు వెన్నుపోటు పొడిచింది వైసీపీయేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలన అరాచకమన్నారు. రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. రూ.700 కోట్లు వెచ్చించి రుషికొండలో ప్యాలెస్ నిర్మించారని, ఆ నిధులతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని కొన్ని ప్రాజెక్టులు పూర్తవుతాయని అన్నారు. ఇప్పుడు ఆ ప్యాలెస్ నిరుపయోగంగా ఉందన్నారు. ఇక మద్యనిషేధం అంటూ ప్రకటనలు గుప్పించారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే లేదని అన్నారు. కల్తీ మద్యం అమ్మి ఎంతోమంది అనారోగ్యానికి వైసీపీ కారణం కాదా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌ను రాజధానిలేని రాష్ట్రంగా మిగిల్చిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రాజధాని అమరావతి కోసం అహోరాత్రులు శ్రమిస్తున్నారన్నారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 2014 నుంచి 2019 వరకూ భూసేకరణ, శంకుస్థాపన వంటి కార్యక్రమాలు పూర్తి చేశారన్నారు. 2019 నుంచి 2024 మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వైసీపీ కృషి చేయకపోగా, అప్పటికే శంకుస్థాపన చేసిన దానికి మరో పర్యాయం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈ ఏడాదిలోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి హామీలు అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ఆల్తి బంగారుబాబు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

'ఉపాధి' బకాయిలు రూ.1.87 కోట్లు

●ఏప్రిల్ రెండో వారం నుంచి అందని వేతనాలు ●కొనసాగుతున్న పనులు

విజయనగరం రూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలంలో వివిధ గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులకు సంబం ధించి వేతన బకాయిలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇక్కడి ఉపాధి వేతనదారులకు రూ 1.78 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ రెండో వారం నుంచి వేతనాలు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం మండల పరిధిలోని 14,285 మంది జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోగా, 9,513 మందికి జాబ్ కార్డులు అందజేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 5 లక్షల 43 వేల 340 పనిదినాలుగా నిర్ణయించారు. ఏప్రిల్ రెండో వారం నుంచి మే నెల 31 వరకూ 62 పనులు చేపట్టారు. ఇందుకు గానూ 5,300 మంది వేతనదారులు పనిచేశారు. వీరికి ఇప్పటివరకు రూ.1.78 కోట్లు చెల్లించాల్సి ఉంది.

● ఈ నెల 10 లోపు వేతనదారుల అకౌంట్లలో జమయ్యే అవకాశం ఉందని ఉపాధి హామీ పథకం సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు విజ యనగరం మండల పరిధిలోని 13 పంచాయితీల పరిధిలోని 22 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో గ్రామసభల్లో నిర్ణయించిన పనులు జరుగుతున్నాయి.



ఉపాధి పనుల్లో వేతనదారులు



శోభాయాత్రలో ఎమ్మెల్సీ ఇందుకూరి

ఘనంగా శోభాయాత్ర

శృంగవరపుకోట రూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుణ్య తిరుమలగిరి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు, సుదర్శనాలను మహిళల పూర్ణకలశాల నడుమ ఊరేగించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ధారగంగమ్మ ఆలయ అనువంశిక ధర్మకర్త మోపాడ గౌరినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష



విరాళం అందజేస్తున్న లక్ష్మి

విజయనగరం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయంలో నిత్యాన్నదానానికి నగరంలోని బాబామెట్టకు చెందిన ఎం.లక్ష్మి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. పార్వతీపురం దేవాలయాల అటెండర్ ఎం.శంకరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మి.. సంబంధిత విరాళ మొత్తాన్ని మంగళవారం ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలుకు అందజేశారు.

యోగాతో ప్రశాంతత

విజయనగరం రింగురోడ్డు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. మంగళవారం నగరంలో యోగాంధ్ర-2025 అర్బన్ స్థాయి రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, పీడీలు, పీఈటీలు, సీనియర్ అసిస్టెంట్‌లు, యోగా శిక్షకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సైకిల్ దినోత్సవం

విజయనగరం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ పార్కు లో పైడిమాంబ సైకిల్ అండ్ రిక్షా మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంటుపల్లి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఇప్పిలి పరుశురాం, వి.అప్పారావులను సత్కరించారు.

5న అప్రంటీస్ మేళా

రాజాం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 5న అప్రంటీస్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ పూర్తిచేసిన విద్యార్థులు మేళాకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ కోరారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

కొత్తవలస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను మంగళవారం రాష్ట్ర పరిశీలకుడు ఎస్.ప్రసాదరావు, జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో వి.ఆదినారాయణ సందర్శించారు. ఐటమ్ ప్యాకింగ్స్‌ను పరిశీలించారు. వారితో ఎంఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం నిలిపివేత

బొండపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలివాడ గ్రామానికి అక్రమంగా నిర్మించిన రహదారిని మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. రాజచెరువు గర్భాన్ని సర్వేనెంబరు 6లో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న రోడ్డు పనులను ఆయన అడ్డుకున్నారు. త్వరలో సిబ్బందితో సర్వే చేపడతామన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల కూల్చివేత

శృంగవరపుకోట రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలో ఎట్టకేలకు మంగళవారం ఆక్రమణల కూల్చివేతకు అధికారులు చర్యలు చేపట్టారు. గడిచిన కొంతకాలంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరుగుతున్నా, రెవెన్యూ అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దాంతోకి రెవెన్యూ అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆక్రమణదారులపై ఒత్తిడి పెంచారు. మంగళవారం వారు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆర్ఐ మనోజ్, వీఆర్వో నాయుడు కూల్చివేతలను దాంతో స్థానిక యువత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఏడాదిగా ఇక్కడి పంచాయతీలో ఇరిగేషన్, రెవెన్యూ భూములు ఆక్రమణలకు గురయ్యాయని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం విజయనగరానికి చెందిన వైద్యుడు ఆక్రమించిన నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిలో ప్రహరీని స్వచ్ఛందంగా తొలగించుకున్నారన్నారు. అయితే సదరు వ్యక్తి ఆక్రమణలో 62 సెంట్ల ఇరిగేషన్ భూమి ఇంకా ఉందన్నారు. మరొక వ్యక్తి 12 సెంట్ల రెవెన్యూ, మరో 22 సెంట్లు ఇరిగేషన్ భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. మరి వాటి సంగతి ఏంటనీ ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ తమ పరిధిలోని ఆక్రమణలను మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. ఇరిగేషన్ భూమలుల్లో ఆక్రమణలను ఆ శాఖ తొలగించుకోవాల్సి ఉందన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీ కూల్చివేత

నీటి మోటారుకు నిధులు లేవంట

●వారం రోజులుగా మల్లిపూడిలో తాగునీటికి కటకట

శృంగవరపుకోట రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట పంచాయతీ మల్లిపూడిలో వారం రోజులుగా తాగునీటి సరఫరా జరగడంలేదు. దాంతో తాగునీటికి స్థానికులు కటకటలాడుతున్నారు. ఇక్కడి బోరు నుంచి మోటారు సాయంతో ట్యాంక్‌కు నీరు పంపింగ్ చేస్తారు. ఆ నీరు కుళాయిల ద్వారా మల్లిపూడిలో సరఫరా జరుగుతుంది. గతంలో ఓసారి తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలిగితే పంచాయతీ పాలకులు మోటారు బాగుచేయించారు. కొద్దిసేపటికే ఆ మోటారు కాలిపోయిందన్నారు. ఇక ఆ మోటారు పనికిరాదని మెకానిక్ తేల్చాడన్నారు. అయితే కొత్త మోటారు కొనడానికి నిధులు లేవని పంచాయతీ పాలకులు చెబుతుండంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి జగన్ వివరణ కోరగా పంచాయతీలో నిధులు లేవని ఇంకా 15వ ఆర్థిక సంఘ నిధులు రావాల్సి ఉందన్నారు. అవి వస్తే బాగుచేయిస్తామన్నారు. ఇక్కడి తాగునీటి ఇబ్బందులను అధికారుల దృష్టిలో పెడతామన్నారు.

విధివిధానాలను ప్రకటించండి

విజయనగరం దాసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో కీలకమైన తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి కర్మాగారాల భవిష్యత్‌పై రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజును మంగళవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని సహకార చక్కెర కర్మాగారాల్లోని కార్మికులు, ఉద్యోగులు, రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిపెట్టుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లుగా భీమసింగి ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులు, ఉద్యోగులకు పీఎఫ్, గ్రాడ్యూటీ చెల్లించలేదన్నారు. వారంతా ఇబ్బంది పడుతున్నారని, వారి పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని వివరించారు. అదుకు ఆయన సానుకూలంగా స్పందించారు. బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారని బాబ్జీ తెలిపారు.



పరిశ్రమల శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

దేహ దానానికి అంగీకారం

●మిమ్స్‌కు డిక్లరేషన్ అందజేసిన రిటైర్డ్ ఎంఈవో

నెల్లిమర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలంలోని రిటైర్డ్ ఎంఈవో ఈపు విజయకుమార్ తన మరణానంతరం దేహ దానానికి అంగీకరించారు. వైద్య పరిశోధనల నిమిత్తం మిమ్స్ వైద్య కళాశాలకు శరీరం దానం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం మిమ్స్ అనాటమీ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.అనిల్‌కుమార్‌కు స్వీయ డిక్లరేషన్ సమర్పించారు. మరణానంతరం భౌతికకాయాన్ని మిమ్స్‌కు అప్పగించేందుకు ఆయన సతీమణి సత్యవతి కూడా మరో డిక్లరేషన్ సమర్పించారు. వాటిపై కుమార్తె మోహనసాయి మోనిష సంతకం చేశారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్‌కు డాక్టర్ అనిల్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ విషయంలో తనకు దిశానిర్దేశం చేసిన మిమ్స్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావుకు విజయకుమార్ ధన్యవాదాలు తెలిపారు.



డిక్లరేషన్ అందజేస్తున్న విజయ్‌కుమార్

వెన్నుపోటు పేటెంట్ జగన్‌దే: కళా

రాజాం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలి వేటు జగన్మోహన్‌రెడ్డి పేటెంట్లేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విమర్శించారు. మంగళవారం రాత్రి రాజాంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నాన్నకు గొడ్డలి వేటు అతడి ఘనతేనన్నారు. తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన ఆయన వెన్నుపోటు దినాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం కుంభకోణంపై విచారణను తప్పుతోవ పట్టించడానికి వెన్నుపోటు దినాన్ని తలపెట్టారన్నారు. ఎన్ని వెన్నుపోటు దినాలు చేపట్టినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని కళా అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

ప్రజా తీర్పుపై ధర్నా చేస్తారా?

లక్కవరపుకోట, జూన్3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి బుధవారం తలపెట్టిన వెన్నుపోటు కార్యక్రమం అసలు పేరు గొడ్డలి వేటు అని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విమర్శించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ వెన్నుపోటు అని భావిస్తున్నారా అని ప్రశ్నించారు. సిగ్గు లేకుండా వెన్నుపోటు పేరిట ధర్నాలు నిర్వహించడం ఆశ్చర్యకర విషయమన్నారు. పేరు పెట్టేముందు అది ఎవరికి వర్తిస్తుందనేది తెలుసుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీల్లో సగం కూడా నెరవేర్చని జగన్.. అసలైన వెన్నుపోటుదారుడన్నారు. మాఫియా కేసుల నుంచి తప్పించుకునేందుకు వెన్నుపోటును తెరపైకి తెచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే 60 శాతం హామీలు నెరవేర్చామన్నారు. పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్, డీఎస్సీ ప్రకటన వంటివి జగన్‌కు గుర్తులేవా అని ఆమె నిలదీశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

తల్లి, చెల్లిని గెంటేసింది ఎవరు?

భోగాపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెన్నుపోటుకు మరోపేరు జగన్మోహన్‌రెడ్డేనని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చారి కర్రోతు బంగార్రాజు విమర్శించారు. మంగళవారం మండలంలోని పోలిపల్లిలో గల నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు, గొడ్డలి వేటు, పేటెంట్ జగన్‌రెడ్డిదేనన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్ను పోటు పొడిసిన వ్యక్తి అతడేనన్నారు. కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా చూస్తూ జగన్‌కు ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూరాడ తాతారావు, సిరివూరు మౌళివర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంగార్రాజు

దద్దరిల్లిన మండల సమావేశం

●ఎంపీపీ తీరుపై టీడీపీ సభ్యుల ధ్వజం

విజయనగరం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. టీడీపీ సభ్యులు కేకలు, అరుపులతో సమావేశం దద్దరిల్లింది. విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు తీరుపై టీడీపీ సభ్యులు ధ్వజమెత్తారు. నిర్దేశించిన సమయం కంటే ఐదు నిమిషాల ముందుగానే ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమావేశానికి హాజరయ్యారు. ఈ తర్వాత ఎంపీపీ సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఎంపీడీవో గంటా వెంకటరావు ఆధ్వర్యంలో శాఖల వారీగా సమీక్ష జరిగింది. తొలుత డీఆర్‌డీఏ శాఖపై జరిగిన సమీక్షలో.. జొన్నవలస, సారిక, పినవేమలిలో వీవో, వీవోఏలను ఎవరిని అడిగి మార్చారని సంబంధిత అధికారిని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఎక్కువ సమయం చర్చ జరగడంతో మిగిలిన శాఖల సమీక్షకు అవకాశం ఉండబోదని టీడీపీ ఎంపీటీసీ సభ్యులు వేచలపు శ్రీనివాసరావు, రాజేశ్‌వర్మ అభ్యంతరం తెలిపారు. దాంతో తనకు నచ్చిన సమయం వరకూ చర్చ కొనసాగిస్తానని, నా అనుమతి లేకుండా మీరేలా మాట్లాడతారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో టీడీపీ ఎంపీటీసీ సభ్యులందరూ ఎదురుదాడికి దిగారు. ఆయన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై సమీక్ష జరిగింది. ఏపీవోట రవికుమార్ నివేదిక సమర్పించిన అనంతరం మేట్ల నియామకంపై చర్చ ప్రారంభమైన వెంటనే నిబంధనలు చదివి వినిపించాలని ఏపీవోను ఎంపీపీ కోరారు. నిబంధనలు చదువుతున్న మధ్యలో ఎంపీపీ కల్పించుకుని సరిపోతుంది ఆపాలన్నారు. ఒకే ఒక్క నిబంధన చదివి ముగిస్తానని సదరు అధికారి బదులిచ్చారు. దానికి ఎంపీపీ ఒప్పుకోలేదు. ఆపై గట్టిగా అరిచారు. ఎంపీపీ దురుసు వ్యవహారంపై ఏపీవో మనస్తాపం చెందారు. సభ్యులందరూ ఏపీవోకు మద్దతు తెలిపారు. దీంతో మరింత కోపోద్రిక్తుడైన ఎంపీపీ.. సమావేశం అంటే ఏమనుకుంటున్నారు? నిబంధనల పాటించరా? అంటూ మరోసారి ధ్వజమెత్తారు. టీడీపీ ఎంపీటీసీలు వేచలపు శ్రీనివాసరావు, పి.రాజేశ్వర్మతో పాటు మహిళా సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



టీడీపీ సభ్యులతో వాగ్వాదం చేస్తున్న ఎంపీపీ

మలేరియా నివారణ అందరి బాధ్యత

వేపాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ అందరి బాధ్యత అని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఎం.వేణు అన్నారు. మంగళవారం వైద్యులు సంజన, వేణు ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.

●గంట్యాడ: గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గంట్యాడలోని మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

●బొండపల్లి: మలేరియా వ్యాధి శతశాతం నిర్మూలించేలా మాసోత్సవాలను చేపడుతున్నట్టు బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు సీహెచ్.సత్యనారాయణ, సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నామమాత్రంగా థియేటర్ల తనిఖీ

చీపురుపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమా థియేటర్లను రెవెన్యూ అధికారులు నామమాత్రంగా తనిఖీ చేశారు. మంగళవారం చేపట్టిన తనిఖీలో ఇన్‌చార్జి ఆర్డీవో ఆశయ్య, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు తదితరులు పాల్గొన్నారు. థియేటర్‌లో ప్రేక్షకులు లేరన్న సాకుతో తనిఖీని నామమాత్రంగా ముగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆశయ్య మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ప్రదర్శనలు లేనందున ఇక్కడ ఏం జరుగుతుందో గమనించడానికి అవకాశం లేదన్నారు. ప్రేక్షకులు పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు మరోసారి తనిఖీ చేస్తామన్నారు. వారి వెంట తహసీల్దారు ఎస్.రాజారావు ఉన్నారు.



థియేటర్ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ

చిన్నారులపై కనికరం చూపరా?

● వరండాలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ● ఇదీ..పెదఖండేపల్లిలో దుస్థితి

శృంగవరపుకోట రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై కనికరం చూపే నాథులే కరువయ్యారు. మండలంలోని పెదఖండేపల్లిలో 16 నెలలుగా పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నారుల వరండాలోనే ఉంటున్నారు. వడగాలులు, ఎండను పెద్దలే తట్టుకోలేకపోతున్న తరుణంలో చిన్నారుల అవస్థలు ఎవరికీ పట్టడంలేదు. ప్రస్తుతం ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో 20 మంది పిల్లలు ఉన్నారు. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి ఏడాది కిందట వరకూ భవనం ఉండేది. అది మరమ్మతులకు గురికావడంతో రూ.5 లక్షలు జడ్పీ నిధులు కేటాయించారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్య ఫలితంగా సగం పనులే పూర్తయ్యాయి. భవనానికి మరమ్మతుల నేపథ్యంలో పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీని నిర్వహిస్తున్నారు. ఈ భవనం సైతం పాతది కావడంతో తప్పని పరిస్థితుల్లో వరండాలో చిన్నారుల ఉండాల్సి వస్తోంది. దీంతో చిన్నారులు, కేంద్రం నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

●ఈవిషయంపై పంచాయతీరాజ్ జేఈ సత్యనారాయణ వివరణ కోరగా... గతంలో మంజూరైన పనులు కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో రద్దు అయ్యాయన్నారు. ఈ పనుల పునరుద్ధరించాలని కోరుతూ లేఖ రాశామన్నారు. పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.



వరండాలో భోజనాలు చేస్తున్న చిన్నారులు

పదోన్నతి లభించిన కొద్దిరోజులకే..

●రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ ఎస్ఐ దుర్మరణం

బొబ్బిలి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ ఎస్ఐ తూముల సత్యం దుర్మరణం పాలయ్యాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన తూముల సత్యం(52) ఏఎస్ఐగా జగదల్‌పూర్‌లోని 80 బెటాలియన్‌లో సీఆర్పీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల ఆయనకు ఎస్ఐగా పదోన్నతి వచ్చింది. ఆ విషయం కుటుంబ సభ్యులకు తెలియ జేయడానికి సెలవుపై వచ్చాడు. మంగళవారం రామభద్రపురంలోని మేనత్త ఇంటికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. పారాది సమీపంలో ఎదురుగా లారీ, బస్సు వస్తుండగా తప్పించే ప్రయత్నంలో లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యానికి భార్య నాగరత్నం, కుమార్తె బిందు ఉన్నారు. కుమార్తె విశాఖపట్నంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది. కుమారుడు అరవింద్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. సమాచారం తెలుసుకున్న బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పదోన్నతి లభించిన కొద్దిరోజులకే మృతిచెందడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

రామభద్రపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలికను సామాజిక మాధ్యమంలో వేధిస్తున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. మంగళవారం రామభద్రపురం పోలీసులు స్టేషన్‌లో ఏఎస్ఐ అప్పారావు, సిబ్బందితో కలిసి భవ్యా రెడ్డి విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. మెరకముడిదాం మండలంలోని బుధరాయవలసకు చెందిన యువకుడు ఒడిశాలో ఐటీఐ చదువుతున్నాడు. ఆ యువకుడు రామభద్రపురంలో బాలిక పేరిట ఫేస్‌బుక్ ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో బాలిక ఫొటో ఉన్నట్టు క్రియేట్ చేశాడు. దీనికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి బాలికకు సంబంధించి ఫొటోలను న్యూడ్‌గా చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేశాడు. తొలుత రూ.500 పంపాలని రిక్వెస్ట్ చేసి తర్వాత రూ.8 వేలు డిమాండ్ చేశాడు. దీనికి బాలిక ససేమిరా అనడంతో న్యూడ్ ఫోటోలు వైరల్ చేస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు గత నెల 2న రామభద్రపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు మంగళవారం యువకుడి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావును డీఎస్పీ అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు..

నెల్లిమర్ల, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ, పెళ్లి పేరిట మోసగించిన మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన కందివలస వాసుపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.గణేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆరేళ్లుగా ప్రేమ, పెళ్లి పేరిట బాలికను వంచించాడన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు వాసుపై పోక్సో కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

భోగాపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరకుపల్లిలో మద్యం బెల్టు దుకాణాన్ని నిర్వహిస్తున్న మహిళను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఆమె నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ సురేష్, సిబ్బంది ప్రతాప్, సూర్యనారాయణ, శిరీష పాల్గొన్నారన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. మున్సిపాలిటి పరిధిలోని మెంటిపేట కాలనీకి చెందిన రాగోలు విశ్వనాథం రేషన్ సరుకులు విడిపించుకునేందుకు నడచుకుని వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. విశ్వనాథం రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

కొత్తవలస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యంపై కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు పోలీసులు, బాధితుడి తండ్రి వివరాల మేరకు.. మండలంలోని గులివిందాడ గ్రామానికి చెందిన కోట దుర్గాప్రసాద్(22) డిప్లొమా చేశాడు. నర్సీపట్నంలోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 27న నర్సీపట్నం నుంచి స్వగ్రామం గులివిందాడకు బయలుదేరాడు. అదేరోజు కొత్తవలసలో బంధువులకు కనిపించినప్పటికీ ఇంటికి రాలేదని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దుర్గాప్రసాద్ కోసం విచారణ చేయగా విశాఖ రైల్వేస్టేషన్‌లో కుమారుడి మోటార్ సైకిల్ పార్కు చేసి ఉన్నట్టు గుర్తించామన్నారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో కనిపించని పురోగతి

కొత్తవలస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెంలో జరిగిన భారీ చోరీకి సంబంధించిన కేసు దర్యాప్తులో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు ఇంటిలో వారసత్వంగా వస్తున్న రాజరాజేశ్వరి అమ్మవారి బంగారు విగ్రహం చోరీకి గురైన విషయం తెలిసిందే. చోరీ జరిగి వారం రోజులు కావస్తుండటంతో విగ్రహాన్ని ఇప్పటికే పూర్తిగా మార్చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ట్రస్టు చైర్మన్ ఇంటిలోని శక్తి పీఠానికి సంబంధించిన అమ్మవారి విగ్రహం ఒక్కటైనా రికవరీ అయితే చాలని జగదీశ్‌బాబు ఆశిస్తున్నారు. 200 ఏళ్లుగా వారసత్వంగా వస్తున్న అమ్మవారి విగ్రహం, అందుకు సంబంధించిన నగలు చోరీకి గురికావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీకి గురైన రెండు, మూడు రోజుల వరకు పోలీసులు నేరస్థులను గుర్తించి, చోరీ సొత్తును రికవరీ చేస్తారని భావించారు. ఇప్పటికే వారం రోజులు పూర్తవ్వడంతో చోరీ సొత్తును రికవరీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేరస్థులను గుర్తిస్తామని మొదట్లో ధీమా వ్యక్తం చేసిన పోలీసుల్లో.. ఇప్పుడు కొంత అసహనం వ్యక్తమవుతోంది.

పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

రాజాం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) విద్యా హక్కు చట్టాన్ని రాజాంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని అభ్యాస్ పాఠశాలలో పుస్తకాలను విక్రయిస్తుండగా ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. పుస్తకాలు విక్రయిస్తుండగా అడ్డుకోవడంతో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్.. ఎస్ఎఫ్ఐ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. కులం పేరుతో దుర్భాషలాడుతూ రాజేశ్ దాడికి దిగారని ఎస్ఎఫ్ఐ నా యకులు ఆరోపించారు. దాంతో పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎంఈవో దుర్గారావు ఘటన స్థలానికి చేరుకుని పుస్తకాల గదికి తాళాలు వేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్, వెంకీ మాట్లాడుతూ పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారితో జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, వంశీ, రమణ, నాని, చైతన్య తదితరులు పాల్గొన్నారు

యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

విజయనగరం బాబామెట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాలకు తూట్లు పొడుస్తున్న జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో మాణిక్యం నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. రాజాం పట్టణంలోని అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు.

రైతులకు న్యాయం చేయండి

నెల్లిమర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామునిపేటలో వందేళ్లుగా సాగుచేస్తున్న అయ్యవార్లంగారి భూమిపై రైతులకు హక్కులు కల్పించాలని గ్రామ పెద్దలు కోరారు. మంగళవారం తహసీల్దార్ సుదర్శనరావుకు వినతిపత్రం సమర్పించారు. భూమి హక్కులు గల అయ్యవార్లంగారి వారసులతో తమకు ఒప్పందం కుదిరిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంబార్కి రామారావు టీడీపీ నాయకుడు సుగుణాకరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు లేవు.. తాగునీరు లేదు

- కాలువలు ఏర్పాటుకు నోచుకోని వైనం
- అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- ఇదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో పరిస్థితి



అలజంగి కాలనీలోకి వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా ఉన్న దృశ్యం

బొబ్బిలి మండలంలోని జగనన్న కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి.అప్పటి వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఎక్కువ మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకురాలేదు. దీంతో కొన్ని లేఅవుట్లల్లో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రధానంగా రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఏపాటి వర్షంకురిసినా కాలనీలు బురదమయమవుతున్నాయి. దీనికి తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో కాలనీల్లో ఉన్నవారు అవస్థలకు గురవుతున్నారు.

బొబ్బిలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలివానిపేటలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కరు వయ్యాయి. అప్పట్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం చాలక పోవడంతోపాటు నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో లబ్ధిదారులు పునాదుల వరకు నిర్మించి నిలిపివేశారు. రంగరాయపురం పంచాయతీ పరిధిలోని చెల్లారపు వలస సమీపంలో జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతు న్నారు. ఇంటింటి కొళాయిలు లేకపోవడంతో తాగు నీటికి, రోడ్లు లేక రాకపోకలకు అగచాట్లకు గురవుతు న్నారు. విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో ఈదురు గాలుల వీచే సమయంలో తీగలు రాపిడితో నిప్పులు రాలుతు న్నాయని స్థానికులు వాపోతునానారు. ఈకాలనీలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించి నట్లు హౌసింగ్ ఈఈ సూర్యనారాయణ తెలిపారు. అలాగే అలజంగి శివారులో సుమారు వంద మందికి స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు జరిగినా రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కొళాయిలు వేస్తామని అప్పట్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా టెండర్లు కాకపోవడంతో పనులు జరగలేదు. దీంతో సమీ పంలోని బీసీకాలనీకి వెళ్లి నీరు తీసుకురావాల్సి వస్తోందని ఇక్కడ నివాస ముంటున్నవారు చెబుతు న్నారు. కాగా అలజంగి శివారులో ఏర్పాటుచేసిన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో తెలిపారు.

గ్రోత్‌సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించండి

- ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు



భరత్‌తో మాట్లాడుతున్న సుజయ్‌కృష్ణ రంగారావు

బొబ్బిలి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రోత్‌సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు కోరారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో సుజయ్ కృష్ణ రంగారావు మంగళవారం విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను వివరించారు. ప్రధానంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. గతంలో భూములు పొంది కాలయాపన చేస్తున్న యాజమాన్యాలను గుర్తించి వారితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు.పరిశ్రమలు స్థాపించకుండా పారిశ్రామిక వాడను నిర్వీర్యం చేస్తున్నారని, సదరు యాజమాన్యాలను సహించవద్దని రంగారావు సూచించారు. పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు గ్రోత్‌సెంటర్‌లో పరిశ్రమలు పెట్టేందుకు తనను సంప్రదిస్తున్నారని వారికి భూములు ఇవ్వాలని మంత్రి భరత్‌ను కోరారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్ తాజా పరిస్థితులపై సమగ్ర సమాచారం అందజేయాలని మంత్రి ఆదేశించారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

- బొబ్బిలి ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు



మాట్లాడుతున్న రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీలు తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయడానికి సహకరించాలని బొబ్బిలి ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు కోరారు. మంగళవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమేవేశం నిర్వహించారు. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలు, నివేదికను ఈడీటీ గౌరిశంకరరావు వివరించారు. అనంతరం రామ్మోహన రావు మాట్లాడుతూ బొబ్బిలి ఏసీలో ఉన్న 264 పోలింగ్ కేంద్రాలకు ప్రతి పీఎస్‌కి ఒక బీఎల్‌ఓను నియమించినట్లు తెలిపారు. వీరి ద్వారా ప్రతి పీఎస్‌లో ఓటర్ లిస్టులను శతశాతం తప్పులు లేకుండా తయారుచేయడంతో పాటు అర్హులైన ఓటర్లను చేర్చుకోవడం, నమోదు చేయనున్నట్లు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ, సీపీఎం ప్రతినిధులు టి.ఈశ్వరరావు, ఎన్.సత్యారావు, డీఎస్ కుమార్, ఎస్. గోపాలం, పి.శంకరరావు పాల్గొన్నారు.

ఇంటి వద్ద రేషన్ పంపిణీ

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులో ఒంటరిగా ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రిడెన్ లబ్ధిదారులకు సంబంధించి వాట్స్ ఆప్ గ్రూప్, మిగిలిన కార్డుదారులతో కూడా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేయాలని రేషన్ డీలర్లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. రేషన్ డీలర్లే వారికి ఇంటి వద్ద రేషన్ సరుకులు అందజేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో కార్డుదారులకు ఇబ్బంది కలిగించే రీతిలో వ్యవహరించిన డీలర్లపై చర్యలు తీసుకొని పంపిణీ బాధ్యతలను వీఆర్వోలకు అప్పగిస్తామని హెచ్చరించారు.

యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చు

బొబ్బిలి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మెట్టవలసలో మంగళవారం సచివాలయ సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈనెల వరకు జరిగే యోగా ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గొంగాడవలసలో ఉపాధిహామీ వేతనదారులు, ఎం.బూర్జవలసలో అంగన్‌వాడీ కేంద్రంలో బాలలు, టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, దిబ్బగుడ్డివలసలో సచివాలయ సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

కనీస వేతనం రూ. పదివేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు



నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

బొబ్బిలి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మంగళవారం బొబ్బిలిలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి యూనిఫారాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ. 20 పెంచాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్లు రద్దు చేయాలని జూలై తొమ్మిదో తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.గోపాలం, ఎండీఎం నాయకులు రామలక్ష్మి, ఆదిలక్ష్మి, చంద్రకళ, రాములమ్మ, విజయ పాల్గొన్నారు.

సైకిల్‌పై ప్రయాణం శ్రేయస్కరం

బొబ్బిలిరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి):సైకిల్‌పై ప్రయాణం శ్రేయస్కరమని, కాలుష్యం తగ్గించవచ్చని వీరాంజనేయ బొబ్బిలిపట్టణ సైకిల్‌మెకానిక్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మొకర గైరి శంకరరావు తెలిపారు. మంగళవారం బొబ్బిలిలో వీరాంజనేయ బొబ్బిలిపట్టణ సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం పురస్కరించుకొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు అడపా నీలకంఠం, కార్యదర్శి ఎడ్ల లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు, తదితురులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెత్తశుద్ధి లేకపోయె

(ఐదో పేజీ తరువాయి)

పారిశుధ్య పనులు జరిగే అవకాశం లేదు. బొబ్బిలిలో రోజుకు సగటున 24 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 105 మంది ఔట్ సోర్సింగ్, 42 మంది రెగ్యులర్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. 30 వార్డుల్లో పూర్తిస్థాయి చెత్త సేకరణ జరగాలంటే మరో 50 మంది వరకూ పారిశుధ్య కార్మికుల నియామకం చేపట్టాలి. సాలూరులో రోజుకు 18 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. 86 మంది ఔట్ సోర్సింగ్, 35 మంది రెగ్యులర్ కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ కూడా ఓ 40 మందిని నియమించాల్సి ఉంది. పార్వతీపురంలో 23 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 88 మంది అవుట్ సోర్సింగ్, 38 మంది రెగ్యులర్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంగా విస్తరించినా ..ఆ స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టడానికి వీలులేకుండా పోతోంది. ఇక్కడ 100 మంది కార్మికులను నియమించాల్సి ఉంది. నెల్లిమర్ల నగర పంచాయతీలో రోజుకు సగటున 16 మెట్రిక్ టన్నుల మేర చెత్త ఉత్పత్తవుతోంది. ఇక్కడ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 40 మంది పనిచేస్తుండగా.. రెగ్యులర్ కార్మికులు నలుగురు మాత్రమే ఉన్నారు. చంపావతి నదీ పరివాహక ప్రాంతం కావడం.. కుచించుకుపోయిన వీధులు, కాలువలు ఉండడంతో మరో 40 మంది వరకూ పారిశుధ్య కార్మికులను నియమించాల్సిన అవసరం ఉంది. రాజాంలో రోజుకు సగటున 16 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 56 మంది అవుట్ సోర్సింగ్, ఆరుగురు రెగ్యులర్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మరో 50 మందిని నియమించాల్సి ఉంది. పాలకొండలో రోజుకు 12 నుంచి 14 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. ఇక్కడ 68 మంది అవుట్ సోర్సింగ్, 9 మంది రెగ్యులర్ కార్మికులు ఉన్నారు. ఇక్కడ కూడా 40 మంది కార్మికుల నియామకం చేపట్టాల్సి ఉంది.

కొరత వాస్తవమే..

రాజాం మునిసిపాల్టీలో పారిశుధ్య కార్మికుల కొరత ఉంది. దీనిని అధిగమించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నవారితోనే పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. కార్మికులను పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

- జె రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మునిసిపాల్టీ

ఈ-దోపిడీకి అడ్డేలేదా?

(ఐదో పేజీ తరువాయి)

చెబుతూ ఈ-స్టాంపులను తెరపైకి తెచ్చింది. వీటి సరఫరా బాధ్యతను స్టాక్ హోల్డింగ్ ఇండియా కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 155 ఈ-స్టాంపు విక్రయకేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 29 ప్రభుత్వ,ప్రైవేటు రంగాల బ్యాంకులు, 61 సీఎస్సీ సెంటర్లు, 31 వ్యక్తిగత కేంద్రాలతోపాటు 34 మంది స్టాంపు వెండర్లు వీటిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రజల అవసరాలు పెరుగుతున్న కొద్దీ వీటి సంఖ్య పెరుగుతోంది. ఈస్టాంపుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురువుతున్నా గత్యంతరం లేక ప్రజలు క్రమంగా అలవాటుపడ్డారు. కాగా ఈస్టాంపుల దోపిడీకి బీజం విక్రయకేంద్రాలవద్దే పడింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నప్పటికీ కృత్రిమ కొరత సృష్టించి ఒకవేళ ఎక్కడైనా ఉన్నా, అవి చెల్లుబాటు కావని భయపెట్టి ఒక్కో ఈస్టాంపును రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. అభ్యంతరం చెప్పేవాళ్లకు స్టాంపులు లేవని అంటున్నారు. వాటికోసం వేరేచోటుకు వెళ్లలేక వినియోగదారులు చివరకు వారు చెప్పినట్లే చేస్తున్నారు.

- ఈ-స్టాంపుల వ్యవహారంలో కొత్త బాగోతం కూడా నడుస్తోంది. ఈ-స్టాంపుల విక్రేతలు, నోటరీలు ఎక్కువగా చేసే అడ్వకేట్లకు మధ్య దళారులు పుట్టుకొచ్చారు. సదరు నోటరీ అడ్వకేటు పేరున గంపగుత్తగా ఒకేసారి వందలసంఖ్యలో ఈస్టాంపులను ఇచ్చేలా డీల్ కుదుర్చుతున్నారు. స్టాంపు విలువను బట్టి ఒక్కో స్టాంపుపై అదనంగా కొంత వేసుకొని స్టాంపు వెండర్ల వద్ద తీసుకొని, దానిపై మరికొంత వేసి అడ్వకేట్లకు దళారులు సరఫరా చేస్తున్నారు. ఒకేదెబ్బకు మూడుపిట్టల్లా, ఇటు వెండర్‌కి , అటు దళారీకి డబ్బేడబ్బు వచ్చిపడుతోంది. డబ్బులు కాస్త ఎక్కువైనా కావాల్సిన స్టాంపులు కాళ్లదగ్గరకు రావడంతో అడ్వకేట్లు కూడా ఖుషీ అవుతున్నారు.
- మీసేవ, సీఎస్సీ, కంప్యూటర్ సెంటర్లు నడుపుతున్న కొందరు వెండర్లు మరోరకం దోపిడీ పర్వాన్ని నడుపుతున్నారు. నేరుగా నోటరీ అడ్వకేట్లతోనే లింకులు పెట్టుకుంటున్నారు. ఖాళీస్టాంపు పేపర్లపై నోటరీ అడ్వకేట్‌తో సంతకాలు చేయించి ఒప్పందం ప్రకారం అందుకు కొంత మొత్తాన్ని సదరు అడ్వకేట్‌కు ముట్టజెప్పుతున్నారు. కంప్యూటర్లలో నమోదు చేసిన వివిధ నోటరీ టెక్స్ ఫార్మేట్లను అడ్వకేట్ సంతకం చేసి ఇచ్చిన ఖాళీ స్టాంపు పేపర్లపై ప్రింట్ తీసి ఇస్తూ ఇదో వ్యాపారంగా పెట్టుకున్నారు. ఈ విధంగా ఒక్కో నోటరీకి డిమాండ్‌ను బట్టి నాలుగైదు వందల రూపాయలు గుంజుతున్నారు. ఈ కుమ్మక్కు వ్యాపారం నేపథ్యంలోనే సదరు మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఇచ్చట నోటరీ చేయబడును అని ఫ్లెక్సీలు సైతం పెడుతున్నారు.
- జిల్లావ్యాప్తంగా ఉన్న 155 ఈస్టాంపుల విక్రయ కేంద్రాల్లో ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకుల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా అదనపు ధరల వడ్డింపు సాధారణ విషయంగా మారిపోయింది. వెండర్లు, దళారులు, మరికొన్ని వర్గాలు కలిసి సామాన్య ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నాయి. వ్యవహారం ఇంత విచ్చలవిడిగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.
- అమ్మిన స్టాంప్ పేపర్ల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. రికార్డుల్లో కాకిలెక్కలు కళ్లెదుటే కనిపిస్తున్నా కనీసం స్పందించడం లేదు. కొంతమంది వెండర్లు, విక్రేతలు బండారం బైటపడకుండా డబుల్ రికార్డులు నిర్వహిస్తున్నట్టు కూడా తెలుస్తోంది.
- నోటరీ నాటకం వల్ల ఒక్కోసారి సంబంధిత అడ్వకేటు కూడా ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని న్యాయవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. అడ్వకేట్లు సంతకాలు చేసి ఇచ్చే ఖాళీ స్టాంపు పేపర్లను కొందరు అత్యాశపరులైన మీసేవ, సీఎస్సీ నిర్వాహకులు, వెండర్లు దుర్వినియోగం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆ మూడు ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వండి

(ఐదో పేజీ తరువాయి)

ప్రసవానంతరం గర్భిణులు, శిశువులు మృతి చెందిన ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో జీవనరాణిని ఆదేశించారు. గర్భిణులు వెంపడాపు లీలావతి, బంగారి సుధ మరణంపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. కొరమ దుర్గ మృతి విషయంలో పీజీస్టార్ ఆసుపత్రికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ఇస్తున్న నివేదికలు పొంతన లేకుండా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో ఇరు శాఖల అధికారులు నెలకొకసారి సమావేశమై చర్చించుకోవాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టరు శుభశ్రీ రాణి, డీఐవో డాక్టరు అచ్యుతకుమారి, సీడీపీఓ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు సమావేశానికి రాకపోవడంపై మండిపడ్డారు.

ఘన విజయానికి ఏడాది

(ఐదో పేజీ తరువాయి)

కూటమి పాగా వేసింది. వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. బొత్స మంత్రాంగం పనిచేయలేదు. డిప్యూటీస్పీకర్‌గా ఉన్న కోలగట్ల వీరభద్రస్వామిలాంటి సీనియర్లు టీడీపీ కూటమి ప్రభంజనం ముందు నిలబడలేకపోయారు. భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు.

ఆధిపత్యానికి చెక్..

ఐదేళ్లలో వైసీపీ చాలా దూకుడుగా వ్యవహరించింది. అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల నుంచి మునిసిపల్ ఎన్నికల వరకు హవా చాటుకుంటూ వచ్చింది. అన్నింటా ఏకపక్షమే. జిల్లాలో 30 మండలాలకుగాను పది వరకూ జడ్పీటీసీలను ఏకగ్రీవం చేసుకుంది. విజయనగరం జిల్లా పరిస్థితులను చూసి నాడు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఐదేళ్ల పాటు సగటు టీడీపీ కార్యకర్త పడిన బాధలు వర్ణనాతీతం. ఆ అవమానాలు, కేసులు, అఘాయిత్యాలను చూసిన టీడీపీ శ్రేణులు ధైర్యంగా ముందుకు వచ్చి పోరాటం చేశాయి. అటు జనసేన అదనపు బలంగా నిలిచింది. బీజేపీ సాయం కూడా తోడైంది. కూటమిగా జత కట్టి వైసీపీని మట్టికరిపించారు.

ఊహకందని ఫలితాలు..

2024 సార్వత్రిక ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. జనసేనకు ఉమ్మడి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలను కేటాయించాల్సి వచ్చింది. రెండు కూడా టీడీపీకి సంస్థాగతంగా బలమైనవే. అందులో నెల్లిమర్లను జనసేనకు కేటాయిం చారు. ఆపార్టీ అభ్యర్థిగా లోకం నాగమాధవిని ఎంపిక చేశారు. దీనిపై టీడీపీ నుంచి అభ్యంతరాలు వెల్లాయి. అప్పటివరకూ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న కర్రోతు బంగార్రాజువర్గీయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీంతో గెలుపు నల్లేరు మీద నడక అనుకుంది వైసీపీ.కానీ జనసేన, టీడీపీ సమన్వయం చేసుకోవడంతో చక్కటి విజయం సొంతం చేసుకుంది. విజయనగరం, గజపతినగరం, ఎస్.కోట,రాజాంలో ఉన్న టీడీపీ అంతర్గత విభేదాలతో తాము గట్టెక్కుతామని వైసీపీ నేతలు ధీమాతో ఉండేవారు. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. చీపురుపల్లిలో మనల్ని ఆపేదెవరు అన్నట్టు అప్పటి మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే బొత్స సత్యనారాయణ సౌండ్‌చేశారు. దీనికి చంద్రబాబు చక్కటి వ్యూహం అమలుచేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఉన్న కళా వెంకటరావును చీపురుపల్లికి షిఫ్ట్‌చేశారు. ఎన్నికల ముంగిటే కళా వెంకటరావు అ భ్యర్థిగా మారినా.. టీడీపీ నేతలు సమన్వయంతో వ్యవహరించడంతో కళావెంకటరావు గెలుపు నల్లేరుమీద నడకలా మారింది. కార్యకర్తలకు అసలుసిసలైన సంబరం దక్కింది.

సామాన్య నేత ఎంపీగా..

నాడు అందరికంటే విజయనగరం ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడు గెలుపు అందర్నీ సంభ్రమాశ్చర్యంలో ముంచింది. ఓ సామాన్య నాయకు డిగా ఉన్న కలిశెట్టి అప్పలనాయుడును సామాజిక సమీకరణ ల్లో భాగంగా ఎంపీ అభ్యర్థిగా అవకాశమిచ్చారు. 'సామా న్యుడికి టికెట్ ఇచ్చాను. ఆయనకు ఒక అవకాశం ఇవ్వండి' అంటూ చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు పిలుపుని చ్చారు. ఆయన కోరినట్లే విశేషంగా మద్దతు పలికారు. దీంతో సిట్టింగ్ ఎంపీగా ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌పై కలిశెట్టి భారీ విజయం సాధించారు.

ఖైదీలపై వివక్ష చూపితే చర్యలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

బొబ్బిలి/రూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): ఖైదీలపై వివక్షత చూపితే చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బబిత తెలిపారు. మంగళవారం బొబ్బిలి సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధులను పరిశీలించారు.జైల్‌లోని ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్తవ్యమని తెలిపారు.

వాహనదారుడికి జరిమానా

రామభద్రపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో మద్యం తాగి వాహనం నడిపిన ఓ వాహనదారుడికి రూ.10వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాలూరు కోర్టు మెజిస్ట్రేట్ హర్షవర్దన్ తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

7,856 ఫాంపాండ్ల లక్ష్యం

రామభద్రపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 7,856 ఫాంపాండ్లు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రమామణి తెలిపారు. మంగళవారం రామభద్రపురం మండలపరిషత్ కార్యాలయంలో ఆమెవిలేకరులతో మాట్లాడుతూ ఈనెలలోగా 3,822 ఫాంపొండ్లు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బండ్, రింగ్ ట్రెంచ్‌లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సీజన్‌లో హార్టికల్చర్ అబివృద్ధికి ప్రత్యేక ప్రణాళికరూపొందించామని, వర్షాకాలంలో మొక్కలు నాటడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి వేతనదారునికి రూ.307లు కనీస వేతనం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.వేతనదారుల డిమాండ్ బట్టి పనులు మంజూరు చేస్తున్నామన్నారు. వేతనదారుల బిల్లులు కూడా సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారుతొలుత మామిడివలస, మిర్తివలసల్లో ఉపాధి పనులు పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవోరత్నం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడానికి కృషి

రామభద్రపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు తెలిపారు.కడపలోజరిగిన మహానాడు విజయవంతం కావడంతో కార్యకర్తల్లో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు. మంగళవారం మండలంలోని బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెలలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి పేదవాడికి పక్కా ఇళ్ల నిర్మాణం చేయడానికి లక్షలాది ఇళ్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో తెలుగుదేశం నాయకుడు గంటా సాయికుమార్ పాల్గొన్నారు.